ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5, కనిష్ఠం 20.6



5

కామారెడ్డి
జిల్లా వార్తలు


గురువారం 8 ఫిబ్రవరి 2024

11న పెద్ద కొడప్‌గల్‌లో గురుకుల ప్రవేశ పరీక్ష

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 7: ఈ నెల 11న నిర్వహించనున్న గురుకుల ప్రవేశ పరీక్ష పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాలలో ఉంటుందని పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5వ తరగతిలో ప్రవేశానికి జిల్లా వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో 11న పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గతంలో పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాల చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో ఉన్నందున ప్రస్తుతం విద్యార్థుల హాల్ టికెట్టుపైన చిన్న తక్కడ్‌పల్లి అని ఉంటుందని, అయితే ప్రవేశ పరీక్ష మాత్రం పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాలలో ఉంటుందన్నారు.



బడ్జెట్‌పైనే భారీ ఆశలు



యాచారంలో నిలిచిపోయిన 22వ ప్యాకేజీ సొరంగ మార్గం పనులు

- కొత్త ప్రభుత్వమైన కరుణించేనా?
- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించేనా?
- గత ప్రభుత్వ హయాంలో బడ్జెట్‌లో అరకొర గానే కేటాయింపులు
- సాగునీటి ప్రాజెక్టులతో పాటు విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలి
- ఎన్నికల్లో ఇచ్చిన కాళేశ్వరం 22 పనులకు నిధులు కేటాయించేనా?
- నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో పూడికతీత జరగక తగ్గుతున్న సామర్థ్యం
- అటకెక్కిన పోచారం ప్రాజెక్ట్ ఎత్తుపెంపు
- నేటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- ప్రజాప్రతినిధులు గళం విప్పాలి.. నిధులు రప్పించాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా రైతన్నలు, ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులకు గత ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం, నిధుల లేమీతో సంవత్సరాల తరబడి ప్రాజెక్టుల పనులు పూర్తికావడం లేదు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బీడు భూములకు సాగునీటిని అందించేందుకు గత 16 ఏళ్ల నుంచి చేపడుతున్న కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు నిధుల గండం పడుతోంది. నిధులు లేక ఈ కాళేశ్వరం పనులు ముందుకు కదలడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం ప్రభుత్వం నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. పలు మండలాల్లో, గ్రామాల్లో వైద్య, విద్య వసతులు కల్పించాల్సి ఉంది.

గళం విప్పాలి.. నిధులు రాబట్టాలి


రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. జిల్లాలో ఎన్నో సంవత్సరాల నుంచి అనేక పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజా సమస్యలు అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై జిల్లా ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రజల పక్షాన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించేందుకు సిద్ధమయ్యారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలోని ఆయా ఎమ్మెల్యేలైన వెంకట రమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతా రావులు అసెంబ్లీలో గళం విప్పి నిధులు రాబట్టాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో దశాబ్దకాలంగా సాగునీరు ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించక పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పాటు వైద్య, విద్య పరంగా జిల్లాకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని జిల్లా ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.

జలశయాలకు నిధులు పారేనా?

జిల్లాలో నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాల లాంటి సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ చాలా ప్రాంతాలకు సాగు, తాగునీరు అందడం లేదు. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో సగానికి పైగా మండలాల్లో సాగునీరు అందలేక ఆయా ప్రాంతాల రైతులు సంవత్సరంలో ఒకే పంటను సాగు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద 22వ ప్యాకేజ్ పనులను రీడిజైన్ చేసి గత ప్రభుత్వం చేపట్టింది. కానీ ఈ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడం జరిగిన పనులు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పనులను పూర్తిచేస్తే రైతులకు ఉపయోగపడనుంది. పనులను త్వరితగతిన పూర్తిచేసి కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల రైతులను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి తీసు కురానున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వరద ప్రదాయినిగా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో పూడికతీతకు నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్ట్‌లో పూడిక పెరుకపోయి సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న పోచారం ప్రాజెక్ట్ ఎత్తు పెంచుతామని ఆయకట్టు రైతులకు మరింత సాగునీరు అందించేలా చేస్తామని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైందే తప్ప పనులు మాత్రం జరగలేదనే విమర్శలు వ్యక్తం అవుతు న్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల ఆధునికీకరణకు సరైన నిధులు కేటాయించకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ బడ్జెట్‌లోనైన జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయించాలి

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాలలో గత కొన్ని సంవత్సరాల నుంచి అభివృద్ధి పనులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న ప్రధాన రహదారుల విస్తీర్ణంకు, ఆయా మండలాల్లోని, గ్రామాల్లో, తండాల్లో రోడ్ల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేయనున్నారు. అదేవిధంగా జిల్లాలో వైద్య, విద్యాపరంగా మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకురానున్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు



పోచారం ప్రాజెక్టు



భూంపల్లి రిజర్వాయర్ నుంచి తవ్వకాలు జరిపిన ప్రధాన కాలువ

పీఎం విశ్వకర్మను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7: సంప్రదాయ చేతి వృత్తులు, హస్త కళాకారులను బలోపేతం చేయడంతో పాటు ఆర్థికంగా చేయూత అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పథకం పట్ల గ్రామ, పట్టణ స్థాయిలో విస్తృంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిలో సామర్థ్యం మెరుగుపరిచి ఉత్పాదకత నాణ్యత, ఉత్పత్తులను పెంచడం ఈ పథకం ఉద్దేశ్యమని తెలిపారు. పథకంలో చేరడం వల్ల విశ్వకర్మ సర్టిఫికెట్, ఐడీ కార్డుతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకొనుటకు కావాల్సిన శిక్షణ, టూల్‌కిట్స్, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహం, మార్కెటింగ్ చేసుకొనుటకు ప్రభుత్వ మద్దతు లభిస్తుందని తెలిపారు. 18 సంవత్సరాలుపైబడిన కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని ఎలాంటి విద్యార్హత లేకున్నా పేరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణ అందిస్తారని శిక్షణ కాలంలో ప్రతిరోజూ రూ.500ల భృతి ఇవ్వడంతో పాటు శిక్షణ అనంతరం 15వేల రూపాయల విలువైన టూల్‌కిట్లు, ధ్రువీకరణ పత్రం అందిస్తామని తెలిపారు. మూడు విడతలుగా లక్ష, రెండు, మూడు లక్షల వరకు రుణం అందిస్తామని తెలిపారు. ఈనెల 16న చిన్న, మధ్యతరహ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున అవగాహన సదస్సు నిర్వస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు రాజేష్‌కుమార్ యాదవ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ లాల్‌నాయక్, రఘునందన్, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను బయట వేస్తే జరిమానా విధించాలి

దోమకొండ: గ్రామాల్లో ఎవరైన చెత్తను బయట వేస్తే జరిమానా విధించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఎంపీడీవో చిన్నారెడ్డికి ఆదేశించారు. బుధవారం దోమకొండ మండల కేంద్రంలో స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెలు పచ్చదనం పరిశుభ్రతతో పరిఢవిల్లిననాడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలుగుతామని అన్నారు. బుధవారం నుంచి ఈ నెల 14 వరకు చేపడుతున్న స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా దోమకొండ మండల కేంద్రంలో చేపట్టిన పరిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. పార చేతబట్టి బాలికల పాఠశాలలో కలెక్టర్ శ్రమదానం చేశారు. ముళ్లపొదలను తొలగించారు. స్పెషల్ డ్రైవ్‌లో ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, స్వచ్ఛంధ సంస్థలను భాగస్వాములను చేసి పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు. గ్రామం మాది అనే భావనతో రోడ్ల వెంట చెత్త వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, ఇరువైపులా నీడనిచ్చే అందమైన పూలమొక్కలు ఉండేలా చూడాలన్నారు. బాలికల టాయిలెట్స్ వద్ద గ్రీన్ షెడ్ నెట్ ఏర్పాటు చేయించారు. స్పెషల్ డ్రైవ్‌లో మురుగు కాలువలు శుభ్రం, తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి రీసైక్లింగ్ చేయడం, ప్రాథమిక అవసరాలైన తాగు నీరు సమస్య రాకుండా పైపుల లీకేజీలను సరి చేసుకుంటూ క్రమం తప్పకుండా తాగు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లెప్రగతిలో భాగంగా పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠదామాలు, కంపోజ్ షెడ్డుల నిర్వహణపై కుడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఫిబ్రవరి 28 లోపు ఆస్తి పన్నులు వసూలు చేసే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పర్యటించి ఎవరైన చెత్తను బయట వేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు వృధా చేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్‌రావు, డీఎల్‌పీవో సాయిబాబా, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ సంజయ్‌రావు, ఎంపీవో తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి, శ్రీనివాస్, ఎంపీటీసీలు నిమ్మ శంకర్, కడారి రమేష్, కార్యదర్శి సౌజన్య, ఐకెపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడకు నేనే బాస్

- ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే వదిలిపెట్టం
- ప్రొటోకాల్ కాదని పనులు చేస్తే ఊరుకునేది లేదు
- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యపడని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని ఆశీర్వాదం, ప్రజల అభిమానం, కార్యకర్తల కృషితో తాను బాన్సువాడ ఎమ్మెల్యేగా 23,464 ఓట్ల మెజార్టీతో గెలిచానన్నారు. ప్రజాభిమానంతో ఎమ్మెల్యేగా గెలిచిన తానే బాన్సువాడ నియోజకవర్గానికి బాస్‌నని అన్నారు. ప్రభుత్వం అధికారంలో లేకపోయినా ఎమ్మెల్యేకు ప్రొటోకాల్ ఉంటుందని, ప్రొటోకాల్ కాదని పనులు చేస్తే మంత్రుల కార్లకు అడ్డంగా పడుకుంటానని ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, తనను నమ్ముకున్న కార్యకర్తలకు పోచారం కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటు oదన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని నాయకుడు బాన్సువాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానంటే ప్రజలు నమ్మరని, సొంత ఊరిలో ఒక్క ఇల్లు కట్టివ్వలేదని, ప్రభుత్వ పాఠశాల భవనం పడిపోతున్నా పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాను ఎవరిపైనా కక్షసాధించలేదని, మా నాయకలకు, కార్యకర్తలకు కూడా అలా చేయమని చెప్పలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమ నాయకుడు కేసీఆర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం సమంజసం కాదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో నిలదీస్తామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం శోచనీయమన్నారు. రైతులకు 2 లక్షల రుణమాఫీ, రైతుబంధు తక్షణమే అందజేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో గ్రామగ్రామాన తిరిగి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్లను గెలిపించకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం అవకాశమిస్తే ఎంపీగా పోటీ చేస్తా : భాస్కర్‌రెడ్డి

బీఆర్ఎస్ అధిష్ఠానం ఆదేశిస్తే జహీరాబాద్ ఎంపీగా పోటీ చేస్తానని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎంబీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమవేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జహీరాబాద్ ఎంపీ స్థానం విజయంలో ఎప్పుడు కూడా బాన్సువాడ నియోజకవర్గం కీలకమైందన్నారు. అవకాశమిస్తే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాలనకు ఆకర్షిలవుతున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ప్రజారంజక పాలనను చూసి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కౌన్సిలర్‌లు ఆకర్షితులవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై కామారెడ్డి కౌన్సిలర్‌లు, నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు, ప్రజలు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణంతో పాటు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల వరకు వైద్యసేవలు ఉచితంగా అందిస్తుందన్నారు. త్వరలోనే గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను రూ.500లకే అందిస్తామన్నారు. త్వరలో ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు రైతులు పండించిన ప్రతీ పంటకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. ఇల్లు నిర్మించుకునే వారికి ఐదు లక్షల రూపాయలు ఇస్తు, రైతుబంధును ఎకరాకు పదిహేను వేల రూపాయలను అందించబోతున్నట్లు తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు రూ.4వేల పెన్షన్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, మున్సిపల్ కౌన్సిలర్‌లు అన్వర్, పాక జ్ఞానేశ్వరీ, శివకృష్ణమూర్తి, వంశీ, వనిత, రమేష్, మమత, శంకర్‌రావు, రవి, మానస, లత, లావణ్య, సుగుణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7: మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఆయా పనులలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ప్రతిపక్ష నాయకుడు వెంకటరమణారెడ్డి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదు ఆధారంగా విజిలెన్స్ అధికారులు కామారెడ్డి మున్సిపాలిటిలోని ఆయాశాఖలకు సంబంధించిన వివరాలు సేకరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పలుచోట్ల పనులను పరిశీలించిన విచారణ మధ్యలోనే ఆగిపోయింది. అయితే ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పాటుకావడంతో పెండింగ్ ఫైళ్లను మళ్లీ పరిశీలనచేస్తున్నట్లు సమాచారం.ఇందులో భాగంగానే కామారెడ్డి మున్సిపాలిటిలో అవినీతి, అక్రమాలకు సంబంధించి మళ్లీ విచారణను మొదలుపెట్టింది. గతనెల 17, 18వ తేదీలలో మున్సిపల్‌లోని నాలుగు విభాగాలకు చెందిన అధికారులు పనులకు సంబంధించిన నివేదికలను అందించాలని కోరడంతో అధికారులు విచారణకు హజరై వారి వద్ద ఉన్న నివేదికలను అందించారు. అయితే బుధవారం ఆ పనులను పరిశీలించేందుకు విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేసి పలు భవనాలు, క్రీడప్రాంగణాలు,పట్టణ ప్రకృతి వనాలు, మున్సిపల్ ఖాళీ స్థలాలు, తదితర అంశాలను పరిశీలించారు. వారు గుర్తించిన అంశాలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు.



పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

'సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి'

మాచారెడ్డి,ఫిబ్రవరి 7:సంత్ సద్గుర్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ మండల అధ్యక్షుడు గోపాల్‌కృష్ణ అన్నారు. అనాగరికంగా జీవిస్తున్న బంజారాలను ఆధ్యాత్మిక, విజ్ఞానపరమైన పరిజ్ఞానం సాధించేలా సేవాలాల్ మహరాజ్ కృషి చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిందని, కానీ సెలవుదినంగా ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవుదినంగా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంతయ్య, రాజ్‌ఖాన్‌పేట్ ప్రధానోపాధ్యాయుడు దేవిచంద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీ ఎదుట కాంగ్రెస్ జెండాలతో నాయకులు

'ఫ్యాక్టరీని కాంగ్రెస్ పునరుద్ధరిస్తుంది'

బోధన్‌రూరల్, ఫిబ్రవరి7: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందనే నమ్మకం తమకు ఉందని కార్మిక సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ గేట్ ఎదుట బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని కార్మికులకు, కర్షకులకు మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కమిటీలు వేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఫ్యాక్టరీ పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. అలాగే 2015 లేఆఫ్ నాటి నుంచి రైతులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ముగిసిన సాధు సమ్మేళనం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి7: గత మూడురోజులుగా డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో కొనసాగుతున్న వశిష్ట సంచార శతసత్సంగ మహోత్సవ సంబరాలు సాధు సమ్మేళనం బుధవారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. ఆచార్య పరిపూర్ణనందగిరి, విష్ణుసేవనంద స్వామి, శంకరనంద స్వామి, బ్రహ్మశ్రీ తుకారం జగదీశ్వరనంద స్వామి అనంత నందగిరి స్వామి, ఒంకార నంద స్వామి, పురుషోత్తం మహరాజ్, శ్రీరాజరామనంద మహరాజ్, బ్రహ్మనంద మహరాజ్ స్వాములు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషనలు చేశారు. ప్రతీఒక్కరు భగవద్గీత పారాయణం ద్వారా ఏకాగ్రత నెలకొంటుందని, సాధుసమ్మేళనం ద్వార జానయజనం నెలకొంటుందన్నారు. ఇందులో ఎంపీపీ గడ్డె భూమన్న,పార్షి సంధ్యరాణి, రాజేందర్, రాజరాం, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, ఆశోక్, భరత్ భూషన్ హాజరయ్యారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి7: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీయూ ఏబీవీపీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ నుంచి రావల్సిన రూ.కోటి బకాయిలను వెంటనే విడుదల చేయించాలని, వర్సిటీ కార్యవర్గ సభ్యులు శివా ఆధ్వర్యంలో విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో మూడు హాస్టళ్లలోనిధులు లేకపోవడంతో అరకొరగా హాస్టళ్లు కొనసాగుతున్నాయని, ఇలాగే కొనసాగితే హాస్టళ్లు మూతబడే అవకాశం ఉందన్నారు. స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవీపేట, ఫిబ్రవరి7: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యాదగిరిగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నాడాపూర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లను చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై గఫర్, పోలీసు సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

బాల్యానికి బలం.. పోషకాహారం

● జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీ ● స్వచ్ఛంద సంస్థ సహకారంతో వారానికి 3రోజులు పాటు అందజేత



పిల్లలకు రాగి జావా వడ్డిస్తున్న దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి7: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువుతోపాటు పోషకాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛంధ సంస్థ సహకారంతో కొనసాగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించే కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

● వారానికి మూడు రోజులు

ప్రస్తుతం వారానికి మూడు రోజులు రాగి జావను అందించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రాగి పౌడర్, బెల్లం పౌడర్‌ను జిల్లా కేంద్రాలకు సరఫరా చేశారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు, పాఠశాలల మధ్యాహ్నభోజన ఏజెన్సీలకు సరఫరా చేశారు. వారు దాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు.

● జిల్లాలో 1,23,590 మందికి పిల్లలకు..

జిల్లాలో ప్రస్తుతం మొదటి విడతలో 41 ప్రభుత్వ పాఠశాలల్లో 5,029మంది విద్యార్థులకు రాగిజావను అందించారు. గత ఏడు నెలల నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 1,23,590 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం పిల్లలకు రాగిజావ అందిస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో విరామ సమయంలో విద్యార్థులకు రాగి జావను అందిస్తున్నారు.

● పోషకాహార లోపాన్ని అధిగమించేలా..

పోర్టిఫైడ్ రాగి పిండి, బెల్లం మిశ్రమంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. జావ తయారీకి వినియోగించే మిశ్రమంలో రాగి, బెల్లం, సోయా, బియ్యం, దాల్చిన చెక్క, పసుపు, ఉప్పు తదితరవి ఉంటాయి. వాటిని పొడిగా చేసి సాయి ష్యూర్ పేరిట ప్యాకెట్లను పాఠశాలలకు అందిస్తున్నారు. వీటిలో కార్బొహైడ్రేడ్ కాల్షియం, మెగ్నీషియం, వివిధ రకాల విటమిన్లు, ఫైబర్లు, ఐరన్ దాగి ఉన్నాయి. విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపకరించనున్నాయి. రాగి జావ పంపిణీ కార్యక్రమంగా సక్రమంగా కొనసాగిస్తే విద్యార్థుల్లో పోషకాహార లోపం సమస్యను అధిగమించవచ్చు.

సక్రమంగా అమలు చేస్తున్నాం

● నాగనాథ్, ఎంఈవో, కోటగిరి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నాం. మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో 5వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వారానికి మూడు రోజుల పాటు విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నాం. స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

గ్రంథాలయ భవన సెంట్రింగ్ తొలగింపు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సెంట్రింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి7: నవీపేట శాఖ గ్రంథాలయం మొదటి అంతస్తులో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణానికి సంబంధించిన స్లాబ్ సెంట్రింగ్‌ను బుధవారం తొలగించారు. జిల్లా గ్రంథాలయ శాఖకు చెందిన రూ.30లక్షలతో నవీపేట గ్రంథాలయం మొదటి అంతస్తులో అదనపు గదుల నిర్మాణం చేపట్టినా దీనికి సంబంధించి స్లాబ్ వేసి రెండున్నర నెలలు గడిచిన సెంట్రింగ్ తొలగించకపోవడంతో ఈనెల 5న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'అసంపూర్తిగా గ్రంథాలయం' అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం భవన స్లాబ్‌కు సంబంధించిన సెంట్రింగ్‌ను తొలగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కోటగిరి, ఫిబ్రవరి7: ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరి కనీస మౌలిక వసతులు కరువై అధ్వానంగా తయారయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండలకేంద్రంలోని పలు ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను బుధవారం సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు మెరుగుపర్చి ఉపాధ్యాయ పోస్టులతో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్, కార్యాలయ సిబ్బంది, నైట్ వాచ్‌మెన్, స్కావెంజర్‌లను నియమించాలన్నారు. గత ప్రభుత్వం సామాన్యుడికి విద్యను దూరం చేస్తూ వ్యాపారం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ స్కూల్‌లలో వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిర్జాపూర్ పాఠశాల కూలిపోయే దశలో ఉందని, తరగతి గదులు లేక మహిళ సంఘం భవనంలో తరగతులు నిర్వహించే పరిస్థితి లేదన్నారు. పాఠశాల భవనం ముందున్న రేకులు ఊడిపోయి విద్యార్థుల మీద పడే ప్రమాదము ఉన్నందున త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు, ఓమయ్య, విఠల్ గౌడ్, గంగాధర్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమకారులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 7: ప్రజా ఉద్యమకారులపై ఖమ్మం సీపీ సునిల్‌దత్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, వాటిని వెనక్కి తీసుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు మల్లేష్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో ప్రజాపంథా పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను పోలీసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. ప్రజా ఉద్యమకారులను రౌడీ షీటర్లు అంటూ సంబోధిస్తూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖమ్మం సీపీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాపంథా నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోధన్ ప్రజా పంథా నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, సీహెచ్ గంగయ్య, బాలయ్య, రాజు, శంకర్, శ్రీను, నాగమణి, తదితరులు ఉన్నారు.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె

పెద్దబజార్, ఫిబ్రవరి 7: ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణా బీడీవర్కర్స్, సిగార్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు గోపాల్స్వామి, నూర్జహాన్ కోరారు. బుధవారం నగరంలోని శివాజీనగర్‌లో గల తెలంగాణా బీడీ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులకు సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ సామాన్య హక్కులపై దాడిచేస్తుందన్నారు. దేశానికి ఆర్థిక వనరులను సమకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు.

కులగణనపై అవగాహన

బోధన్‌రూరల్, ఫిబ్రవరి7: బోధన్ పట్టణంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జంగమ కుల గణనపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగమ సమాజ్ కుల సంఘాల నాయకులు పురాణే అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సమీక్ష కోసం చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అప్ప, నాయకులు సిద్ద లింగప్ప, చంద్రశేఖర్, నర్సింగ్ అప్ప, దిలీప్‌కుమార్, శంకరప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దగ్ధం

కోటగిరి, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కోటగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బాల్క సుమన్ తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు షాషెద్, మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, తదితరులు ఉన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

టీహబ్‌కు ప్రతీరోజు 20 శాంపిళ్లను పంపించాలి

● డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్

భిక్కనూరు, ఫిబ్రవరి7: భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన టీహబ్ సెంటర్‌కు ప్రతీరోజు తక్కువ శాంపిళ్లు వస్తున్నాయని, ప్రతీరోజు తప్పనిసరిగా 15 నుంచి 20 శాంపిళ్లు పంపాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ సూచించారు. బుధవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలోని ఓపీ, సిబ్బంది రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్, ల్యాబ్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీహబ్‌లో అన్నిరకాల పరిక్షలు ఉచితంగా చేయ్యడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో సేకరించిన షాంపిళ్లకు ఇక్కడే పరిక్షలు నిర్వహించి రిజల్ట్‌ను తిరిగి పెషేంట్‌కు అందజేస్తామన్నారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి దేవిహేమిమా, వైద్యుడు ఆదర్శ్, సిబ్బంది రమణ, లతీఫ్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఫిర్యాదుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలి

● డీపీవో శ్రీనివాస్‌రావు ● గ్రామంలో పారిశుధ్య పనుల పరిశీలన

భిక్కనూరు, ఫిబ్రవరి7: ప్రతీ గ్రామంలో ఫిర్యాదుల రిజిస్టర్‌ను తప్పకుండా ఏర్పాటు చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను డీపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో మురికికాలువలు, రోడ్లను, ప్రభుత్వ సంస్థల పరిసరాలను శభ్రం చేసి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, యువకులను బాగస్వాములు చేయాలని, అన్నిగ్రామాల్లో గుట్కా, గంజాయి, డ్రగ్స్ వలన కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.



జంగంపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో

ఈ నెలాఖరు వరకు ప్రతిగ్రామంలో 100శాతం పన్నులను వసూళ్లు చే యాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సాయి బాబా, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ నర్సింలుయాదవ్, ఉపసర్పంచ్ బాస్కర్‌చారీ, పం చాయతీ కార్యదర్శి బాబు, గ్రామస్థులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి7: ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని, దానిద్వారా మెటిరియల్ కాంపోనెంట్ లభిస్తుందని జడ్పీచైర్‌పర్సన్ దఫేదర్‌శోభ అన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులతోపాటు వర్షాకాలంలో రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధిహామీ పనులు చేయాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ఆయాశాఖల అధికారులు వారి ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీసీఈవో సాయాగౌడ్, జడ్పీటీసీలు హనుమాన్లు, భారతీ, శంకర్‌నాయక్, శ్రీలత ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న వేస్టేజ్ మందుల పట్టివేత

రాజంపేట, ఫిబ్రవరి7: మండలంలోని కొండాపూర్ గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వేస్టేజ్ మందులను పట్టుకున్నట్లు ఏవో సుప్రజ్యోతి తెలిపారు. బుధవారం అల్విన్ ఇండస్ట్రిస్ పేరుతో ఉన్న వేస్టెజ్ ప్రాడెక్టలను ఆటోలలో తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారని పలువురు రైతులు ఫిర్యాదులు చేయడంతో స్టాక్‌ను పట్టుకున్నట్లు వెల్లడించారు. సదరు ప్రొడెక్ట్‌కు ఎలాంటి లైసెన్స్ లేదని, నిబంధనల ఉల్లంఘన కింద అగ్రిహ్యూమిక్ గ్రానెల్స్ 36 బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజ్‌కుమార్, రమాదేవి, శ్రీశైలం, బుట్టరాజులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు



నడిపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ఇందల్‌వాయి, ఫిబ్రవరి7: మండల కేంద్రంలో ఎంపీడీవో రాములునాయక్ పారిశుధ్య పనులను ప్రారంభించారు. బుధవారం నుంచి ఈనెల 15 వరకు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తుండడంతో ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందని సూచించారు. ఈ మేరకు రోజువారి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వారోత్సవాలు ప్రతి రోజు మురుగుకాలువలు శుభ్రం చేయడం ప్రధాన రహదారులపై చెత్త తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

● కమ్మర్‌పల్లిలో ప్రారంభమైన పారిశుధ్య వారోత్సవాలు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరిశుధ్య వారోత్సవాలు మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల అద్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండలకేంద్రంలోని మండలపరిశత్ కార్యాలయంవద్ద ప్రత్యేక అధికారి ఎంపీడీవో టీ. సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యాలయం చుట్టూ ముల్లపొదలను, చెత్త చెదారాన్ని పంచాయితి పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ పాలెపు గంగారాం, పంచాయితి కార్యదర్శి శాంతి కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండంలోని బషీరాబాద్ లో గ్రామ ప్రత్యేక అధికారి షైలారం గంగాధర్ అద్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. మండంలోని అన్ని గ్రామాలలో వారం రోజులపాటు పారిశుధ్య వారోత్సవాలు కొనసాగనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

● జక్రాన్‌పల్లిలో పారిశుధ్య పనులు

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్నిగ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. జక్రాన్‌పల్లిలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో బ్రహ్మనందం, కొలిప్యాక్‌లో గ్రామప్రత్యేక అధికారి, పశువైద్యాధికారిణి డాక్టర్ శిరీష పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మురికి, డ్రైనేజీల్లో మురుగును తొలగించారు. రోడ్లపై ఉన్న చెత్తచెదారాన్ని ఊడ్చి, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారి

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లిపంచాయతీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం నడిపల్లి పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను మండల ప్రత్యేక అధికారి రాజేందర్ ఎంపీడీవో గోపిబాబు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వారోత్సవాలను అన్ని గ్రామాల్లో సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పారిశుధ్య వారోత్సవాలపై శ్రద్ధ చూలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

● పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

మోస్రా: మండల కేంద్రంతోపాటు మండలంలోని గోవూర్ గ్రామంలో బాన్సువాడ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పీడీ చందర్ నాయక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతను పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సరిపోకపోతే బయట కూలీలతో పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. చెత్త చెదారం లేకుండా గ్రామాలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారులు సాయిలు, రఫీ, ఏపీఎం ముఖీమ్, కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, ముతీబ్, కారోబార్ రాము పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో పారిశుధ్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతీఒక్కరు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి నందకుమారి సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, పాత బస్టాండ్ ప్రాంతాలలో మురికి కాలువలను పరిశీలించారు. మురికి కాలువలలో పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోవడంతో యంత్రాల సహాయంతో పూడిక తొలగించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పారిశుధ్య సమస్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీటీసీ మనోహర్, నాయకులు బర్ల మధు, పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ పాల్గొన్నారు.



ఇందల్వాయిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

● గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 7నుంచి 14వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. పొతంగల్, నవీపేట, రాంపూర్, నాగేపూర్‌లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణలు పరిశీలించారు.

● పారిశుధ్య పనుల పరిశీలన

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో బుదవారం చేపట్టిన పారిశుధ్య పనులను గ్రామ ప్రత్యేక అధికారి ఎంపిఓ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. గ్రామ కూడళ్లలో, రోడ్లపై చెత్త వేస్తున్న గ్రామస్తులతో ఆయన మాట్లాడి చెత్తను రోడ్డుపై వేయవద్దని, చెత్త ట్రాక్టర్ వచ్చినపుడే అందులో వేయాలని సూచించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ దత్తు, ఫీల్డ్ అసిస్టెంట్ సుచరిత తదితరులు ఉన్నారు.

● ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు

రుద్రూరు: ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, వివిధ గ్రామాలలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమాలలో వివిధ గ్రామాలలోని ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.



చేపల పెంపకం వివరాలను తెలుసుకుంటున్న కొడంగల్ అధికారులు

ఫిష్‌పాండ్‌పై క్షేత్రస్థాయి సందర్శన

సదాశివనగర్, ఫిబ్రవరి 7: మండలంలోని మోడేగాంలో చేపడుతున్న చేపల పెంపకం విధానాన్ని కొడంగల్‌కు చెందిన అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా చేపల పెంపకం నిర్వహిస్తున్న రైతులతో వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న ఈ చేపల పెంపకం ఫలితాలను ఇస్తుందని రైతులకు మంచి లాభాలు తెచ్చిపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, వెంకటేశ్వర్లు, ఏడీ లక్ష్మప్ప, వ్యవసాయాధికారి తనూజ, రైతులు గాల్‌రెడ్డి, రామస్వామి, హిందుకుమార్, శేఖర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

సదాశివనగర్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్‌లో బుధవారం తహసీల్దార్ హిమబిందు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానుమతి, వైస్ ఎంపీపీగా శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వడ్ల రాజేందర్, విండో చైర్మన్ కమలాకర్‌రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై ఎల్లారెడ్డి ఎస్‌ఐ మహేష్ బృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా సైబర్ నేరగాళ్లు ఓటీపీ చెప్పమని అడిగినా లింకులపై క్లిక్ చేయాలని చెప్పినా వారి మాటలు విని ఎవరైనా సైబర్ నేరాల పట్ల మోసపోయినా వారు 1930 నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిబాబా, ఉపాధ్యాయులు నాగరాజు, శశి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో సైబర్ క్రైం మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలపై విద్యార్థులకు వివరించారు. యువత పరిచయం లేని వ్యక్తులతో చాటింగ్‌లు చేయవద్దని ఒకవేళ అలాంటి పరిస్థితులు ఉంటే 1930కు వెంటనే సమాచారం ఇచ్చినట్లయితే ఆన్‌లైన్‌లో మోసాల నుంచి రక్షించుకోవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ హిమబిందు మాట్లాడుతూ సోషల్‌మీడియా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భానుమతి, ఎస్‌ఐ రాజు, ఏఎస్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ప్రారంభం

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 7: ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రారంభించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు వారి సమస్యలు చెప్పుకోవడానికి 7207 976565, 7032225344 నెంబర్లకు ఫోన్ చేసి సమస్యలను తెలుపవచ్చన్నారు. అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సాయిబాబా

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 7:మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాని ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిబాబా అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడిపేట్, కళ్యాణి, బ్రాహ్మణపల్లి, అల్మాజీపూర్, సబ్దల్‌పూర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, దరఖాస్తు చేసుకోడానికి చివరి తేది ఈ నెల 22 వరకు ఉందని ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆయనతో పాటు శశిశంకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 7 : వీధి వ్యాపారులకు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సక్రమంగా చెల్లించాలని ఎల్లారెడ్డి ఎస్‌బీఐ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ స్వామి అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా పది వేలు తీసుకున్న వారు సక్రమంగా కట్టుకున్న వారికి 20 వేల నుంచి 50 వేల వరకు లోన్ పొందవచ్చునన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు

ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7: కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ విరుద్ధంగా ప్రవర్తిస్తున్న తీరును ఖండిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించినట్లు ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడే పార్టీని వచ్చే ఎన్నికల్లో ప్రజలు మద్దతు పలకాలని నిరంకుశ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమకారుల బాధ్యత అని త్వరలో మేధావులు, ఉద్యమకారులు, కులసంఘాలు, ప్రజాసంఘాలను ఏకం చేసి జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జగన్నాథం, సీపీఐ నాయకుడు నరసింహరెడ్డి, బహుజన సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిరాములు, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, బీపీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, రజనీకాంత్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. గుర్తు తెలియని వ్యక్తులు పిలిస్తే వెళ్లొద్దు

భిక్కనూరు, ఫిబ్రవరి 7: విద్యార్థులు మీ తల్లిదండ్రులు తెలుసని, మిమ్మల్ని ఇంటి వద్ద దిగబెడతానని ఎవరైనా గుర్తుతెలియని కొత్త వ్యక్తులు పిలిస్తే వారిని నమ్మి వెళ్లొద్దని భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని చైతన్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, షీటీం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాంచందర్‌నాయక్, పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన పారిశుధ్య వారోత్సవాలు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. గ్రామ ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు ఆయా గ్రామాల్లో పనులు జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షించారు. పారిశుధ్య వారోత్సవాలు ఈ నెల 7 నుంచి 14 వరకు జరుగుతాయన్నారు. పారిశుధ్య పనులలో భాగంగా మురికి కాలువలు శుభ్ర పరచడం. వీధుల్లో చెత్త చెదారం లేకుండా చేయడం, నీటి ట్యాంక్‌లను శుభ్రపరచడం వంటి పనులను చేస్తామని అధికారులు తెలిపారు. మండలంలోని అల్లాపూర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను ప్రత్యేక అధికారి నదీం పరిశీలించారు.

నసురుల్లాబాద్: ప్రతీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దుర్కి గ్రామంలో అధికారులతో కలిసి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నసురుల్లాబాద్ మండలంలోని ప్రతీ గ్రామ పంచాయతీలో మురికి కాలువలను శుభ్రం చేయాలని, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని, సీసీ, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో రాము, పంచాయతీ సెక్రెటరీ యోగేశ్వర్ తదితరులు ఉన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో ప్రత్యేకాధికారి విజయ్ బండివార్ పారిశుధ్య పనులను చేయించారు. మండల కేంద్రంలోని కాలనీల్లో పారిశుధ్య పనులు చేయించినట్లు వెల్లడించారు. గ్రామస్థులు పారిశుధ్య పనులకు సహకరించాలన్నారు.

పిట్లం: ప్రతీ గ్రామంలో పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు కలిసి గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టామన్నారు. మురికి కాలువలు, రోడ్లు గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో బ్రహ్మం, మండల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, పిట్లం కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

నాగిరెడ్డి పేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులను నిర్వహించారు. మొదటి రోజు గ్రామాల్లో రోడ్లను, మురికి కాలువలను శుభ్రపరిచారు. రోడ్లపైన గుంతలను పూడ్చారు. గ్రామాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది గ్రామస్థులతో కలిసి స్వచ్ఛందంగా రోడ్లను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్, పంచాయితీల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పారిశుధ్య వారోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ జానకి తెలిపారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వీధిలో మురికి కాల్వలు, రోడ్లు శుభ్రపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండల పరిధిలోని చిన్నమల్లారెడ్డి, లింగాయిపల్లి, నర్సన్నపల్లి గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో శంకర్ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను వ్యాధుల నుంచి దూరం చేయడమే కాకుండా నర్సరీల పెంపకం పనులు చేపట్టనుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మౌనిక, అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి



పెద్దకొడప్‌గల్‌లో..



చీనూరులో..



చిన్నమల్లారెడ్డిలో..

జిల్లాలో కాంగ్రెస్ నాయకుల ఆందోళనలు

● మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

బీర్కూర్, ఫిబ్రవరి 7: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమన్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం బీర్కూర్ కామప్ప చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. సుమన్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మకు చెప్పులతో కొడరం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ డీసీసీ కార్యదర్శి కాంత్‌రెడ్డి, మాజీ డీసీసీ కార్యదర్శి బస్వరాజ్ పటేల్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు క్షమార్హం కావన్నారు. పోలీసు అధికారులు సుమన్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు తరలివెళ్లి బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజ్, కాంత్‌రెడ్డి, శంకర్, కమలాకర్‌రెడ్డి, ఇక్బాల్, గంగారాం, కాశీరాం, గంగాధర్, నారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నేత బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్లో పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మాసాని శేఖర్‌రెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, నార్ల రత్నకుమార్, నార్ల సురేష్, చిన్న తదితరులున్నారు.

నసురుల్లాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ దిష్టిబొమ్మను నసురుల్లాబాద్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ అరిగే సాయిలు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను వెంటనె వెనక్కి తీసుకోవాలని క్షమాపణ చెప్పాలని కోరారు. అనంతరం బాల్క సుమన్‌పై చట్టరీత్యపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అయినాల లింగం, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యూసుఫ్, శివప్రసాద్, శాంతయ్య, రవి, మహేందర్‌గౌడ్, శంకర్ నాయక్, జలీల్, ఇక్బాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న సీడీపీవో

మద్నూర్, ఫిబ్రవరి 7: మండలంలోని తడి హిప్పర్గ గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని సమాచారం మేరకు మద్నూర్ ప్రాజెక్టు అధికారిణి సునంద ఆ గ్రామానికి వెళ్లి అబ్బాయి తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా అర్సపల్లి గ్రామానికి చెందిన అమ్మాయికి తడి హిప్పర్గకు చెందిన అబ్బాయితో పెండ్లి నిశ్చయం కాగా అమ్మాయి వయస్సు తక్కువగా ఉండటం వల్ల బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, సీడీపీవో ఇరువురు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాన్ని అడ్డుకోవడంతో పాటు అబ్బాయి తల్లిదండ్రులు బాల్య వివాహం జరిపించమని ఒప్పుకున్నారని సీడీపీవో వివరించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ప్రజలు గమనించాలని, ఎవరైనా ఇలా పెండ్లిలు చేస్తే సమాచారం అందించాలన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

నిజాంసాగర్, ఫిబ్రవరి 7: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గెను మర్యాద పూర్వకంగా కలిసినట్లు వివరించారు. అలాగే గుల్బర్గ ఎమ్మెల్యే అల్లం ప్రభు పాటిల్‌తో పాటు కర్ణాటక రాష్ట్రమంత్రి ఈశ్వర్ ఖండ్రెను సైతం కలిసినట్లు వివరించారు. ఢిల్లీకి వెళ్లిన సమయంలో వారిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

నిజాంసాగర్, ఫిబ్రవరి 7:నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, 11వ తరగతిలో గల ఖాళీల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈ నెల 10వ తేదిన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 7: కామారెడ్డి స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంజార్జ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ సింధూశర్మను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. అదేవిధంగా కామారెడ్డి రూరల్ సీఐగా రామన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన సదాశివనగర్ సీఐగా విధులు నిర్వహించారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించండి

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 7: రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పెద్ద కొడప్‌గల్ ఎస్‌ఐ కోన రెడ్డి సూచించారు. బుధవారం జగన్నాథ్‌పల్లి గేట్ వద్ద 161వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాన్ని జాతీయ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో తమకు కేటాయించిన లైన్‌లోనే నడపాలని, హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సూచించారు. ఇక ఇతర వాహనదారులు కూడ వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930 నెంబర్‌కు తక్షణం ఫోన్ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఫోన్ నెంబర్ పోస్టర్లను గ్రామాలలలో అతికించడం జరిగిందని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైం పై అవగాహన కల్గించారు.

పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాలు

రాజంపేట, ఫిబ్రవరి 7: మండల కేంద్రంతో పాటు గ్రామాలలో మొదటిరోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రత్యేక అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాలల్లో మురికికాలువలు, ప్రభుత్వ బిల్డింగ్‌లలో పారిశుధ్య పనులు చేసినట్లు తెలిపారు.ఈ నెల 14 వరకు పారిశుధ్య కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకిషన్, జడ్పీటీసీ హనుమండ్లు, ఎంపీఓ రఘురాం, కార్యదర్శులు అశోక్, శ్రీజ, వంశీ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కామారెడ్డి రూరల్, ఫిబ్రవరి7: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో గల సరంపల్లి గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ, విజయ డెయిరీ వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువులకు వచ్చే గర్భకోశ వ్యాధిపై అవగహన కల్పించి, మందులు ఉచితంగా అందించారు.ప్రతినెల అవగహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రూపరవికుమార్, నాగయ్య, మారుతి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ కృష్ణ, బాలు, బాబాగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

దోమకొండ, ఫిబ్రవరి 7: మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో బుధవారం మెడిసిటీ హస్పిటల్ మేడ్చల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో బీపి, షుగర్, కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, వరి బీజము, బీజకుట్టు, గడ్డలు, కనథలు, థైరాయిడ్, గర్భసంచి, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పుల పరీక్షలు నిర్వహించారు. 150 మందికి పరీక్షలు చేసి 25 మందిని మెడిసిటీ హైదరాబాద్ హస్పిటల్‌కి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్, ప్రియాంక, వంశీధర్, కౌశిక, సంజయ్, కుమార్‌గౌడ్, రాజుగౌడ్,మాజీ సర్పంచ్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షునిగా హరిలాల్ నాయక్

దోమకొండ, ఫిబ్రవరి 7: కామారెడ్డి జిల్లా బీఎస్పీ అధ్యక్షునిగా హరిలాల్ నాయక్ నియామకమయ్యారు. తెలంగాణ రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు ఆర్. ఎస్ ప్రవీణ్ కుమార్ నియమించడం జరిగిందని హరిలాల్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 7: కామారెడ్డి పట్టణంలో మంగళవారం రాత్రి జేపీఎన్‌రోడ్డు, కిష్టమ్మగుడి, రాజీవ్‌నగర్ కాలనీలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులుచేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.ఈ దాడులలో 23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన కొడిపాక శ్రీనివాస్, మహ్మద్‌అజీజ్, రేవూరి ప్రభాకర్‌లపై కేసులు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

మొక్కజొన్న పంట తెగుళ్లపై రైతులకు అవగాహన

బిచ్కుంద, ఫిబ్రవరి 7: మండలంలోని పుల్కల్ గ్రామంలో మండల వ్యవ సాయాధికారి రాజలింగం, ఏరువాక కేంద్రం మల్‌తుమ్మెద శాస్త్రవేత్తలు ఏనుగు అనిల్‌రెడ్డి, జేకే రేవంత్‌లు మొక్కజొన్న పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటలలో తెగుళ్ళ, చీడపీడలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాడలు తెగులు ఆశిస్తున్నదని గమనించి ఈకాడల తెగులు వ్యాపించినచో టేబు కోనజోల్ 1ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి బాగా తడిసేలా పిచికారి చేయాలన్నారు. ట్రైకోడెర్మాను పశువుల పేడలోకలిపి నేలలో కలిపి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భీమ్‌పటేల్, మాజీ ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, సొసైటి డైరెక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు దయానంద్, సాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

పెద్ద కొడ ప్‌గల్, ఫిబ్రవరి 7: మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో బుధవారం పాఠశాల ప్రహగోడ నిర్మాణ పనులను ఎంపీడీవో రాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలకు ప్రహరీ కూలిపోయిందని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెల్లడంతో ఉపాధిహామీ నిధులు 14.85 లక్షల రూపాయల నిధులు అధికారులు విడుదల చేశారని తెలిపారు. ఈ పనులతో పాఠశాల గోడ నిర్మాణానికి గాను భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయిలు, పీఆర్ ఏఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో సూర్యకాంత్, జూనియర్ పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో 'గావ్ చలో' కార్యక్రమం

బీర్కూర్, ఫిబ్రవరి 7: నసురుల్లాబాద్ మండలంలోని హాజీపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి గావ్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోది, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. త్వరలో జరగనున్న జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపొందడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సున్నం సాయిలు, మహిళా అధ్యక్షురాలు కంది సావిత్రి, ప్రధాన కార్యదర్శి మేకల రామన్న యాదవ్, కంది పెద్ద మల్లేష్, బీజేపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి వివరాల సేకరణ

నిజాంసాగర్, ఫిబ్రవరి 7: గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ శాఖాధికారులు గ్రామ గ్రామాన తిరుగుతూ వివరాలను సేకరిస్తున్నారు. ట్రాన్స్‌కో డీఈఈ కామేశ్వర్ రావు మాట్లాడుతూ మండలంలోని నర్వ గ్రామంలో ఇంటింటి తిరిగి వినియోగదారుల ఆధార్ నెంబర్లు, విద్యుత్ మీటర్లు, ఫోన్ నెంబర్లు, తెల్ల రేషన్ కార్డుల వివరాలను సేకరించామన్నారు. ఎవరైనా అందుబాటులో లేకుంటే ఆధార్ నెంబర్, తెల్ల రేషన్ నెంబర్, ఫోన్ నెంబర్లు మీటర్ల పక్కన జిరాక్స్‌లు, నెంబర్లు రాసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ బాలాజీ, సబ్ఇంజనీర్ అక్షయ్ కుమార్, లైన్‌మెన్ సాయిలు, తదితరులున్నారు.

మండల స్థాయి పోటీలు

మద్నూర్, ఫిబ్రవరి 7: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఉన్నటువంటి 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు పోయెట్రి, సాంగ్స్ క్విజ్ తదితర 4 అంశాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిరాములు మాట్లాడుతూ ప్రథమ స్థానంలో నిలిచిన వారు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని గుర్తు చేశారు. విద్యార్థులు మండల స్థాయి పోటీల్లో పాల్గొని తమ సత్తా చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో రికార్డుల పరిశీలన

మద్నూర్, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యాశాఖాధికారులు రికార్డులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఫిజికల్ వెరిఫికేషన్ పరిశీలించినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు యూనిక్ ఐడీ విధిగా ఉండాలని పేర్కొన్నారు. హాజరు పట్టికను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేందర్, సీఆర్పీలు జ్యోతి, మల్లికార్జున్, రవికాంత్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రామారెడ్డి,ఫిబ్రవరి 7:మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రామారెడ్డి ఐకేపీ ఏపీఎం ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని రెడ్డిపేట సెక్టర్ మద్దికుంట గ్రామ ఐకేపీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఓరియంటేషన్, సెన్సిటైజషన్‌లపై వివరించడంతో పాటు సంఘసభ్యులకు ఆర్థిక లావాదేవిలపై పలు అంశాలను వివరించారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన


బిచ్కుంద, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలపై ఆకర్షితులు కాకుండా మంచి నడవడికతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అకాడమి కోఆర్డినేటర్ చంద్రశేఖర్, మాదకద్రవ్యాల నియంత్రణ కోఆర్డినేటర్ వెంకటేశం, కమిటిమెంబర్‌లు తదితరులు పాల్గొన్నారు

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7: కామారెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు నామినేషన్‌లను స్వీకరిస్తున్నట్లు ఎన్నికల కమిటీ కన్వీనర్ గౌరి శంకర్, కో కన్వీనర్ రవీందర్‌లు తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను వివరించారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యానగర్ కాలనీలోని ఏపీ డ్రగ్స్ వద్ద నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. నామినేషన్స్ ఉప సంహరణకు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉందని తెలిపారు. ఈనెల 11న అశోక్‌నగర్ కాలనీలో పార్వ రాముల కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు గజవాద రవికుమార్, కైలాస్ సంతోష్ కుమార్, బొమ్మ రమేష్, తులసీదాస్, మోహన్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 7: కార్మికులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ కార్మికులకు సూచించారు. బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో మున్సిపల్ కార్యాలయంలో ముందు కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం వారితో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతీ వార్డులో శుభ్రత బాధ్యత, అలాగే రోడ్లపై ప్లాస్టిక్ కవర్స్, చిత్తు కాగితాలు, ఇతర చెడిపోయిన వస్తువులు ఉంటే తొలగించాలని కార్మికులను సూచించారు. మున్సిపల్ పరిధిలో మురికి కాలువ కూడా చెత్త ఉంటే తొలగించాలని మున్సిపల్ చైర్మన్ కార్మికులను కోరారు.



చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్ (కిలో)	:	100	180	210

